


ఫుట్ పాత్

రోడ్డు ప్రమాదాలను అరికట్టాలనే సదుద్దేశ్యంతో ఫుట్ పాత్ వేస్తుంటారు. రోడ్డుకి రెండు పక్కలా వుంటాయి. ఫుట్ పాత్ లు వచ్చేపోయే జనాని కవి సేఫ్టీజోన్స్. వాటి మీద నడుస్తే ప్రాణాలకు గ్యారంటీ వుంటుంది. ఫుట్ పాత్ రద్దీగా వుంటే మనిషిని మనిషి రాసుకుంటూ పోవచ్చు నేమోగానీ వాహనాల బెడద వుండదు. కారులూ, లారీలూ, ఆటోలూ, బస్సులూ ఇత్యాది వాహనాలు ఫుట్ పాత్ ని ఎక్కడో, ఎవ్వరో పొగరుబోతు కళ్ళు నెత్తిమీద పెట్టుకుని వాహనాన్ని ఫుట్ పాత్ ని ఎక్కిస్తే ఎక్కించవచ్చు.

ఫుట్ పాత్ అంటే కాలి బాట అని అర్థం చెప్పుకుంటాం. పాదచారులు మాత్రమే నడవ తగ్గ ప్రాంతమని అంటారు. అయితే వచ్చిన చిక్కేమి

టంటే ఫుట్‌పాత్ మీద నడిచేందుకు చోటుండదు. ఫుట్‌పాత్ అంటే చిన్న సైజు మార్కెట్టని కూడా చెప్పుకోవచ్చు. ఇక్కడ నిత్యవాడకానికి సమస్త వస్తువులూ చవగ్గా దొరుకుతాయి. చెప్పులు కావాలన్నా, పళ్ళు కొనుక్కోవాలనుకున్నా, సెకెండ్ హాండ్ దుస్తులూ, పుస్తకాలూ, ఫెన్సీ సరుకులూ, కూరగాయలూ అన్నీ అందుబాటు ధరల్లో లభిస్తుంటాయి. చవగ్గా మనమేదయినా కొంటే ఫుట్‌పాత్‌మీద కొన్నావా అని అడుగుతుంటారు. అంటే ఫుట్‌పాత్ అంటే మినీ మార్కెట్టని అర్థమై పోయిందని మన అర్థం చేసుకోవాలి. ఫుట్‌పాత్ మీద కొన్ని బళ్ళుంటాయి. ఆ బళ్ళు కదుల్తుంటాయి. ఇక్కడ్నుంచి అక్కడికి, అక్కడ్నుంచి ఇక్కడికి ఆ బళ్ళలోనే సమస్త సామాగ్రి అమ్మకానికి వుంటాయి. అవన్నీ చవక దుకాణాలుగా మనం గ్రహించాలి. అందుచేత. ఫుట్‌పాత్ అంటే చవక దుకాణాల నిలయమని కొత్త అర్థమొకటి చెప్పుకోవాలి. దిక్కులు చూడకు రామయ్యాని ఒక సినిమా పాట వింటుంటాం: దిక్కులు చూస్తే ఏమవుతుందో ఆ కవిగారికే తెలియాలి. ఫుట్‌పాత్ మీద దిక్కులు చూసుకుంటూనడిస్తే మాత్రం పళ్ళ బండో, కూరగాయల కార్టో మన చొక్కాకి తగులుకుని మన్నతో పాటు వచ్చేస్తుంది. ఆ తరువాత పెద్ద గొడవవుతుంది. బళ్ళ వాళ్ళేదో అంటారు. హీటెక్కి పోయి మనంకూడా అరుస్తాం. ఇది ఫుట్‌పాత్ అని ఇంగ్లీషులో చెప్పి తెలుగులో అర్థం చదువుతాం. మన విజ్ఞానాన్ని వాళ్ళు పట్టించుకోరు. నోటి కొచ్చినట్టు మాటలు విసిరేస్తారు. మాటలు పూర్తయిన తర్వాత చేయీ చేయీ కలవడమో, చొక్కాలు చిరగడమో ఆ ఉధృతాన్ని బట్టి వుంటుంది.

ఫుట్‌పాత్‌లని పేరుకేవో పెట్టి మనల్ని నీళ్ళు తాగించేకంటే నడిరోడ్డుమీద నడిచి మన ప్రాణాల్ని ఏ వాహనానికో బలిచ్చేయడం బెటరని పార్థసారథి నాతో చాలా తడవలన్నాడు. అతని పిచ్చిగానీ ఇప్పుడు మాత్రం మనం చేస్తున్నది అదేగా. ఫుట్‌పాత్ మీద నడిచేందుకు చోటులేక నడిరోడ్డు

మీద నడుస్తున్నాం. వచ్చేపోయే వాహనాలకు అడ్డం పడి చేతులెత్తి నమస్కరించి నాట్యం చేస్తున్నాం. మనకి ఈ విన్యాసం బాగా అలవాటై పోవడంవల్ల రద్దీలేని ఫుట్‌పాత్‌లు కనిపించినా వాటి మీద నడిచే అభ్యాసం లేక నడిరోడ్డు మీద తప్ప టడుగులు వేస్తున్నాం. గడప దాటగానే శతకోటి దేవుళ్ళకు మొక్కుకుని రోడ్డెక్కుతున్నాం.

ఫుట్‌పాత్‌ల మీద దుకాణాలు పెట్టొద్దని మనలో ఎవరూ అనలేరు. అందుక్కారణ మేమిటో మనకి బాగా తెలుసు. అర్జంటుగా కూరలు కొనాలనుతుంటే అందుబాటులో ఉండేవి ఫుట్‌పాత్‌లే గానీ దుకాణాలకేం పోగలం? జనం బలహీనత తెలిసిన వారు గనక రోజు రోజుకీ కొత్త బళ్ళు వెలుస్తున్నాయి. బేరాలు వృద్ధి చేసుకుంటున్నారు. మీ ఇంట్లో రేడియో లేక పోవచ్చు గానీ బండి మీద తప్పకుండా వుంటుందొక ట్రాన్సిస్టరు. బళ్ళలో టీ. వీ. లు కూడా వెలిసే రోజు దగ్గర పడింది. వ్యాపారం వృద్ధి చెందుతుంటే టీవీలేం ఖర్మ తెరకట్టి సినిమాలే ఆడిస్తారు.

ఫుట్‌పాత్ చిన్న మార్కెట్టే కాదు, అదొక ప్రపంచం కూడానూ. కొన్ని బతుకులు ఫుట్‌పాత్ మీదే గడుస్తున్నాయి. తండ్రి తాతల దగ్గర్నుంచీ అదే స్థలంలో వాళ్ళ జీవితాలు లాగిస్తున్నారు. కుంటీ, గుడ్డి, ముష్టి వాళ్ళను వదిలేయండి. నిక్షేపరాయుళ్ళ కొందర్ని అక్కడే చూస్తుంటాం. వాళ్ళుండే చోటులో కొత్తవాళ్ళు రావడానికి వీల్లేదు. అధికారులు కసురుకుంటే ఆ రోజుకు డేరా ఎత్తేస్తారు. మరుసటి రోజు మళ్ళా వెలుస్తారు. మళయాళ రచయిత 'సుకు' రాసిన ఇంగ్లీషు నవల 'వెట్స్' ఆఫ్ వెంజెన్స్‌లో బొంబాయి ఫుట్‌పాత్‌ల గురించి చాస్టగ్లే రాశాడు. ఆ జీవితాలను చదువుతుంటే భయం వేస్తుంది, బాధా కలుగుతుంది. ఇంట్లోంచి పారిపోయినవాళ్ళు జీవితం మీద విరక్తి కలిగి దేశాలు పట్టుకు తిరిగే వాళ్ళూ, పైపై పోవడం వల్ల బార్ నుంచి గెంటబడిన మందు భాయిలూ ఫుట్ మీదే గడుపు

తుంటారు. రాత్రిళ్ళు ఫుట్‌పాత్ వాళ్ళ పాలిట కన్నతల్లి. సినిమాల్లో కూడా ఫుట్‌పాత్ దృశ్యాలుంటాయి. గుండెలు తరుక్కుపోయే దృశ్యాన్ని అక్కడే షూట్ చేస్తారు. అర్ధరాత్రి నగరం నిదురపోతోంది. ఒకానొక ఫుట్‌పాత్. లైట్ స్తంభం కింద హీరో. వెనక పొగల్లాంటి పొరలు. అతని దుస్తులూ, గడ్డం మాసి వున్నాయి. కళ్ళు లోతుకు పోయి వున్నాయి. మనిషి, మనసూ బాగా నలిగిపోయిన వాలకం. అవసరమనుకుంటే చేతిలో సీసా. ఇంకా అవసరమనుకుంటే పక్కన కుక్కపిల్ల. జీవితం ఖాళీ సీసారా బ్రదర్ పల్లవితో పాట. చాలింక. ఆ సినిమా మొత్తానికి ఆ ఒక్కసీను చాలు. సినిమాలే ఫుట్‌పాత్‌లను ఎట్లా వాడుకోవాలో చెబుతుంటే కాదనేందుకు మన మెంత?

●